# ఆ టచ్చులు మీరో ఇచ్చుకోండి!

రాంపా

ఫ్యాన్ రెక్కల పైన పట్టిన బూజుని దులుపుతున్నాడు పీతాంబరం. తన షాపు వైపే వస్తున్న పాతాళభైరవరావుని దూరం నుంచి చూశాడు. చకచకా . శుభ్రంచేసి కౌంటర్ మీద కూర్చున్నాడు. పాభైరాని వదిలించుకోవడం ఎలా అన్నదే ఆలోచన. ఏదో విధంగా మాటలతో మనసుని రక్కి అయిదుకో పదికో జేబు కొరకంది వూరుకోడు.



''వచ్చినప్పుడల్లా వాణ్ణేం అనలేకపోతున్నాను. వాడన్నది మాత్రం భరిస్తున్నాను. ఇక్కడ తెలివికి సంబంధించి ఎక్కువతక్కువలు కాదు. అదేదో బలహీనత అడ్డుకుంటోంది. ఆడుకుంటోంది. ఈసారి మాత్రం పరాజయ పరంపరకు గీతపెట్టాల్సిందే గోడకట్టాల్సిందే!'' అని తన గొంతు సవరించుకునే లోపులోనే- ''కొట్టుపెట్టగానే కట్టలు కట్టుకుని కస్టమర్లొస్తారనుకుంటే ఎలా'' చేతికందిన కుర్చీలాక్కుని కూర్చుంటూ అన్నాడ పాభైరావచ్చి.

మాటకు మాటేస్తే ఫెళ్ళుమని తగలాలి. ఎదురు మాట దొరకట్లేదని మథన పడుతుంటే అరవైలో యిరవై వేషంలో ఒకాయన వచ్చాడు. అతను వేసుకున్న బట్టలకు మొత్తం యిరవై ఆరు జేబులున్నాయి. షాపు లోపల కళ్ళు తిప్పుతున్నాడు. కొట్టు చుట్టానికి వచ్చినవాణ్ణి కస్టమర్‌గా మార్చే మాటలు నేర్చుకోమంది భార్య, ఏదన్నా మాట్లాడుదామంటే ఈ పాభైరా తిష్టవేశాడు. ఎవరన్నావస్తే బయటికెళ్ళడు పైగా పక్కపక్కనే వుంటాడు. వుంటే వున్నాడులే అనుకుంటే వచ్చిన వాళ్ళకు ఉచ్చు వేస్తుంటాడు. చికాకు నిండిపోయింది పీతాంబరానికి.

''ఏమండీ మీరెవరో నాకు తెలియదు.'' అన్నాడతనితో పాభైరా.

''మీరెవరో నాకు తెలియకపోయినా నేను చెప్పగలను'' అన్నాడతను.

''ఏది చెప్పండి'' అడిగాడు పాభైరా.

''తెలియని వాళ్ళను కూడా తెలిసినట్లు పలకరించే తెలిసీ తెలియని వాళ్ళని'' అన్నాడతను టైం చూసుకుంటూ.

''బాగా చెప్పారు. విషయం ఏంటంటే మనిషికి యిన్ని జేబులవసరమంటారా''

అడగాలనుకున్నది అడిగేశాడు పాభైరా.

''అబ్బే అవసరం లేదండీ'' అన్నాడతను.

''మరెందుకు యాభైగదుల ఇంట్లో ఒకడే వున్నట్లు'' అన్నాడు పాభైరా లైను దొరికిన ఆనందంలో.

''ఎంత చక్కని ఉపమానం చెప్పారండీ. మీరు రచయితా'' అడిగాడతను.

''అదేంటోనండీ అందరూ నన్నలాగే అనుకుంటారు. నాకు మాత్రం ఆ కలం పన్లేవి చేతకావు'' చెప్పాడు పాభైరా.

''అసలు మీరేం చేస్తుంటారు'' అడిగాడతను.

''అడిగేవారెలాగూ లేరని అడగనివాడికి సలహాలిస్తుంటాడు''

తన కొట్లో వీడు వ్యాపారం చేసుకుంటున్నాడన్న కోపంతో వున్న పీతాంబరానికి పాభైరాని మానసికంగా ఒక దెబ్బ కొట్టానన్న ఆనందం కలిగింది.

''అది తెలుస్తూనేవుందండీ. ఇతనికి ఉద్యోగం వుందా, పోయిందా, వదిలేశారా, వదిలేశాడా, అసలు ఉద్యోగం వుండేదా వుంటే ఏం చేసేవాడు. ఇప్పుడెందుకిలా వున్నాడు'' అన్నాడతను.

''నేను చెబుతాగా ఓ ఎమ్మెల్యేకి సెక్యూర్టీగార్డుగా నాలుగునెల్లు చేశాను. నిజాలు చెప్పే నన్నుంచుకోలేక పీకి బైట పడేస్తే బజారుపాలయ్యాను'' చెప్పాడు పాభైరా.

''అది తెలుస్తూనేవుందండీ. ఇతనికి ఉద్యోగం వుందా, పోయిందా, వదిలేశారా, వదిలేశాడా, అసలు ఉద్యోగం వుండేదా వుంటే ఏం చేసేవాడు. ఇప్పుడెందుకిలా వున్నాడు'' అన్నాడతను.
''నేను చెబుతాగా ఓ ఎమ్మెల్యేకి సెక్యూర్టీగార్డుగా నాలుగునెల్లు చేశాను. నిజాలు చెప్పే నన్నుంచుకోలేక పీకి బైట పడేస్తే బజారుపాలయ్యాను'' చెప్పాడు పాభైరా.

''ఆ వివరాలొద్దు లెండిగాని, ఎంతవరకు చదువుకున్నారేం'' అడిగాడతను.

''ఆ ఏదో వానాకాలం చదువులెండి'' మొహం పక్కకు తిప్పి చెప్పాడు పాభైరా.

''అంటే ఏంటండి'' అడిగాడతను అమాయకంగా మొహం పెట్టి.

''ఎప్పుడు బడికెళ్ళినా వర్షం పడి పుస్తకాలు తడిసి బట్టలు తడిసి అవి రెండూ ఎండిందాకా స్కూల్లో వుండి వచ్చే చదువండీ'' చెప్పాడు పీతాంబరం రెండో దెబ్బ కొట్టానన్న ఆనందంతో.

''పోన్లేండి ఏదో ఒకటి పొట్టలో నాలుగు అక్షరం ముక్కలేసుకున్నారు చాలు'' అన్నాడతను.

పాభైరా మీద జాలిపడడం నచ్చట్లేదు పీతాంబరానికి.

''మీ రో పని చేస్తారా'' అడిగాడతను.

''ఎందుకు సార్ అతన్నెక్కడన్నా పనికిపెడితే పెట్టినవాడి పరువు పోతుంది'' అన్నాడు పీతాంబరం. ఇది వీడికి చావుదెబ్బే అని ఎగిరిగంతేస్తూ.

''మీకో పది రూపాయలిస్తా'' అన్నాడతను.

తను దెబ్బ కొడితే యితనెవరో మందురాస్తున్నాడేవిటా అనుకున్నాడు పీతాంబరం. పదిరూపాయల మాటనగానే లేచి నించున్నాడు పాభైరా.

''అదిగో అక్కడ ఎర్రడబ్బా కనబడుతుంది చూశారా'' అన్నాడతను.

''చదువుకున్నవాళ్ళు అలా అంటారేం. అది పోస్ట్‌బాక్స్ కదండీ'' అన్నాడు పాభైరా

''వామ్మో! మీకే ఎక్కువ తెలుసు! దానిదగ్గరికి వెళ్ళి అరగంట నించుని''

''నించోడం దేనికి?''

''అది మీకంత కష్టమైన పనికాదుగా''

''అవుననుకోండి, ఏం చేయమంటారు''

''ఏం లేదు. అరగంటలో అక్కడికి పోస్ట్‌మాన్ వస్తాడు''

''అవునవును. యిప్పుడతను వచ్చేటైమే''

''అదేమరి త్వరగా వెళ్ళి అక్కడ నించుని''

''నించోనించో అంటున్నారుగాని నించోనేం చేయాలో చెప్పట్లేదు''


''ఏమండీ పోస్ట్‌మాన్ గారంటారో ఏయ్ పోస్ట్‌మానంటారో మీ యిష్టం''

''ఏదో ఒకటి అంటానులెండి ఆ తర్వాత ఏం అనాలో చెప్పండి''

''మీరీ ఎర్రడబ్బా''

''పోస్ట్‌బాక్స్''

''సారీ, పోస్ట్‌బాక్సు రోజూ సరిగ్గా ఇదే టైంలో






ఈ తాళం ఎందుకు తీస్తున్నారు లోపలున్న కాయితం ముక్కలు ఎందుకు సంచీలో వేసుకుంటున్నారు అనడగండి''

''కాయితం ముక్కలు కావు. కార్డులు, కవర్లు''

''ఆఁ అదేలెండి సంచీలో ఎందుకేస్తున్నారో అడగండి''

''చొప్పదంటు ప్రశ్నగదా అది''

''ప్రశ్న ఏదనికాదు జవాబు మనకు కావాలి''

''ఆ జవాబుతో ఏం చేసుకుంటారే''

''ఇదిగో యిదీ చొప్పదంటు ప్రశ్న''

టక్కున వెళ్ళాడు పాభైరా!

''సార్! మీరెవరోగాని ఈ పాతాళ భైరవరావుగాణ్ణి ఈవిధంగా వదిలించుకున్న వాణ్ణి మిమ్మల్నే చూస్తున్నా, మీ తెలివిని అభినందిస్తున్నా'' అన్నాడు పీతాంబరం.

''ఏం తెలివండి బాబో పదిరూపాయలు జారవిడుచుకున్నానుగా''

''అయినా క్షణంలో అతని సంగతి ఎలాకనిపెట్టారు సార్''

''అది నా సహజమైన కళలెండి. అది సరే! మీరు ఫ్యాక్టరీ అవుట్‌లెట్ అని పెద్ద బోర్డు పెట్టారు. అందులో నిజం ఎంత నిజంకానిదెంత''

''సార్ ఈ రోజుల్లో మూడు వ్యాపారాలు ఎలా పెట్టినా పెట్టిన పొట్టలు నిండుతునే వున్నాయి. తిండి, బట్ట, చెప్పులు''

''నేనడిగింది ఫ్యాక్టరీ''

''ఆ విషయానికే వస్తున్నా సార్''

''రాండి''

''పోటీ బోల్డెంత అయింది సార్. ఒకటికొంటే ఇంకోటి ఉచితం. ఏదైనా కానండి యాభైరూపాయిలే. ఇరవై పర్సంట్ డిస్కౌంట్ అరవైపర్సంట్ డిస్కౌంట్ డిస్కౌంట్ మీద డిస్కౌంట్''

''డొంక తిరిగి చుట్టుకొలతలు చెప్పమనలేదండీ''

''అసలు మీరు ఏం కొనడానికి వచ్చారు సార్'' అన్నాడు పీతాంబరం.

''అంటే నేనడిగిందానికి జవాబు చెప్పరన్నమాట''

''అవుట్‌లెటో లెటవుటో నాకెందుకు సార్. నేనిక్కడ బట్టలు అమ్ముకోడానికి వున్నాను సార్''

''వచ్చిన ప్రతికస్టమర్ ఏదో ఒకటి కొనాలనేం లేదు గదా''

''సార్ ఏదో కొత్తగా కొట్టు పెట్టాను''

''నాకు కొనడం కొత్తకాదు''

''కొనడంలో కూడా కొత్తాపాతా వుంటుందా సార్''

'' ఉంటుంది నువ్వు ఎక్కడో ఒకచోట కొంటేనే కదా ఇక్కడికొచ్చి అమ్మేది''

''సార్ మీరేం మాట్లాడుతున్నారో నేనేం అంటున్నానో పాతాళభైరవ్‌గాడు ఎందుకొచ్చాడో అసలు నేనెందుకు కొట్టు పెట్టానో నాకేం అర్థం కావట్లేదు సార్''

''మీరంతలా బాధపడుతున్నారు కాబట్టి. ఈ డ్రస్సు తీసుకుంటాను ఎంత''

''వెయ్యి''

''సరే, కొత్త కొట్టు కాబట్టి బేరం కూడా చేయను. ఇదిగోండి వెయ్యి''

***

''ఏడివాడు నాకు చెల్లని పదిరూపాయల నోటిచ్చాడు'' అరచుకుంటూ వచ్చాడు పాభైరా.

పీతాంబరానికెందుకో అనుమాన మొచ్చింది. గల్లా తెరిచి చూసుకున్నాడు రెండు అయిదొందలనోట్లు. రెండూ పిల్లలాడుకునేవే!

''అరేయ్ అథఃపాతాళ భైరవరావూ నువ్వు అడుగుపెట్టావు. నా బుర్రపాడుచేశావు'' కేకపెట్టి చెప్పుతీశాడు పీతాంబరం.

ఈ పరిణామాన్ని ఊహించని పాభైరా ఎలాగోలా చెప్పుదెబ్బకు అందకుండా పారిపోయాడు.

***

తన షాపులో కలిగిన అనుభవాన్ని ఇంటికొచ్చి భార్యకు చెప్పాడు పీతాంబరం.

''ఏదో సైకిలు మీద బట్టలు పెట్టుకుని తిరుగుతుంటే చూడలేక మా నాన్న అక్కడా ఇక్కడా అప్పుచేసి ఈ కొట్టుపెట్టించాడు, అల్లుడుగారు పెరిగి పెద్దవాడు కావాలన్న ఆశతో. వ్యాపార పాఠాలు నేర్చుకోడానికి కొట్టుని బడిగా చేసుకుంటున్నారు మీరు'' గొంతు చేసుకుంది భార్య.

పీతాంబరం నీళ్ళు నమిలి మింగుతున్నాడు.

లాభం లేదని భార్యే అంది ధోరణి మార్చి.

''సరే అయిందేదో అయింది. మార్కెట్లో కదిలే సరుకేదీ కదలనిదేదీ తెలుసుకోవడం, డబ్బులిచ్చేటప్పుడు తీసుకునేటప్పుడు లెక్కపెట్టుకోవడం, చెల్లనివేవీ, చెల్లేవేవీ చూసుకోవడం అన్నిటికీ మించి పొల్లుకబుర్లు పూర్తిగా మానేసి ముక్తసరిగా వుండడం, ఆలోచన, తెలివీ, ఇవన్నీ కావాలి'' చెప్పింది భార్య.

''మరి కస్టమర్లకి హ్యూమన్‌టచ్, హ్యూమర్ టచ్ యివ్వాలి గదా'' అన్నాడు పీతాంబరం.

''మీ వల్ల కాదుగాని వ్యాపార వ్యవహారం నేను చూసుకుంటాలెండి. ఆ టచ్చులేవో మీరిచ్చుకోండి'' అంది భార్య దృఢ నిశ్చయంగా.

★